
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 24.4



నల్లగొండ

5

గురువారం 15 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	587.70 (305.9222)	4,13,660	3,06,090
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.55 (3.58)	289.35	92.70
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	167.78 (35.28)	2,30,195	2,42,278

చికెన్ ధరలు | లైవ్ : రూ.108 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.200

నేడు మూడో విడత
రుణమాఫీ

35,501మందికి రైతులకు రూ.2లక్షలు మాఫీ

జిల్లాకు రూ.442.86కోట్లకు పైగా విడుదల



నల్లగొండ, ఆగస్టు 14: మూడో విడతగా రూ.2లక్ష లవరకు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా వైరాలో గురువారం జరిగే బహిరంగసభలో మూడో విడత రుణమాఫీని ప్రారంభించనున్నారు. ఇప్పటికే రెండు విడతల రుణమాఫీ చేశారు.మొదటి దశలో రూ.లక్ష వరకు, రెండో దశలో లక్షన్నర వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం, మూడో విడతగా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడానికి సన్నద్ధం అవుతోంది. మూడోదశ రుణమాఫీలో జిల్లాలో 35,501 మంది రైతులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది. ఇందుకోసం రూ.442.86 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు గురువారంరైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవం లోగా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రకారం రుణమాఫీ పూర్తి కావొస్తోంది. సాంకేతిక కారణాలతో మిగిలిపోయిన రైతులకు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు మూడో దశ రుణమాఫీ అనంతరం ఆర్జీలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఆ తర్వాత మిగిలిన అర్హులైన రైతులకు రుణమాఫీ చేస్తారు. జిల్లాలో గ్రీవెన్స్‌లకు 12790మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన : డీఈవో



విద్యార్థులకు బూట్లను పంపిణీ చేస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ రూరల్, ఆగస్టు 14: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యా బోధన ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి అన్నారు. బుధవారం మండలంలోని కతాల్‌గూడ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంచరకుంట్ల వెంకట్‌రెడ్డి సమకూర్చిన బూట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తోపాటు దాతలు ముందుకొస్తే విద్యార్థులకు మంచి విద్య అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దండెంపల్లి సరోజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.



స్వాతంత్ర్య ఫలం దక్కేనా
పల్లె వికసించేనా?

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు కావొస్తున్నప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మాత్రం చిన్నాభిన్నంగానే ఉంది. వ్యవసాయ రంగంపై 70నుంచి 80శాతం మంది ఆధారపడి ఉన్న పల్లెల్లో ఇప్పటికీ సమస్యలు తాండవిస్తూనే ఉన్నాయి. ఇంతవరకూ పలు పల్లెలు స్వాతంత్ర్య ఫలాలు పొందడంలో వెనుకబడే ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు అరకొరగా ఉండడమే. నేడు స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ఆ మహాత్ముడు కన్న కలలు 'గ్రామ స్వరాజ్యం' అమలుకు ఆమడదూరంలోనే ఉన్నాయి. 'దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు' అన్న జాతిపిత ఆలోచనలకు పాలకులు తుది రూపం ఇవ్వడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- నల్లగొండ

- గ్రామాల్లో రాజ్యమేలుతున్న సమస్యలు
- స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు
- దెబ్బతింటున్న గ్రామీణ ప్రజల ఆర్థికస్థితిగతులు
- వ్యవసాయ రంగంపై నీలినీడలు
- పూర్తిగా అందుబాటులో లేని వైద్యం
- అస్తవ్యస్థంగా రోడ్లు, మంచినీటి పథకాలు
- బలహీనపడుతున్న స్థానిక సంస్థల వ్యవస్థ



పల్లెలో ఎక్కడ చూసినా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామీణ ప్రాంతాలకు నిధుల కేటాయింపు తక్కువగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదల చేస్తున్న నిధుల నుంచే అన్ని పనులు చేపట్టాల్సి వస్తోంది. వచ్చిన నిధుల నుంచి గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి జీతభత్యాలతోపాటు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి వస్తుంది. గ్రామీణ ప్రజలకు అవసరాలకు సంబంధించిన కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమకూర్చే పరిస్థితులు లేక పోవడంతో స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు అయిన ప్రయోజనం లేదన్న భావన గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

సంక్షోభంలో కూరుకున్న వ్యవసాయం




ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో దాదాపు 21.50లక్షల ఎకరాల్లో పంటల విస్తీర్ణం ఉంటుంది. పెట్టుబడులు లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాల మూలంగా వ్యవసాయం సంక్షోభంలో కూరకపోతుంది. ఒకప్పుడు దేశంలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉద్యాన పంటలది మొదటిస్థానంలో ఉండేది. మూడున్నర లక్షల ఎకరాల్లో బత్తాయితోపాటు ఇతర పండ్లతోటలు సాగయిన పరిస్థితులు ఉండగా ప్రస్తుతం అన్ని ఉద్యాన పంటలు కలిసి కనీసం 65వేల ఎకరాల్లో మాత్రమే విస్తీర్ణంలో ఉంది. దీనికి కారణం ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం, రాయితీలు అందకపోవడం, తెగుళ్ల బెడద, వేరుకుళ్ల సమస్యలు, నీటి వనరులు తగ్గడం మూలంగా ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఇక వరి, పత్తి పంట విస్తీర్ణం ప్రధానంగా జిల్లాలో ఉంటుంది. అయితే వర్షాభావ పరిస్థితుల మూలంగా మెట్ట ప్రాంతాల్లో అంటే నాన్ ఆయకట్టు ప్రాంతంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ప్రధాన నీటి వనరులైన సాగర్ ఆయకట్టు కింద ఈసారి సాగర్ జలాలు పుష్కలంగా ఉండటంతో వరి విస్తీర్ణం పెరగనుంది. ఇదిలా ఉంటే నాన్ ఆయకట్టులో మాత్రం బోరుబావులు అడుగంటిపోయాయి. భూగర్భజలాలపై ప్రభావం కనిపిస్తుంది. దీనికి ముఖ్య కారణం ఈ సంవత్సరం వర్షాలు భారీగా పడకపోవడంతో బోర్లు ఇంకిపోయాయి. ఇక కేవలం అడపదడప కురిసిన వర్షాలతో పత్తి పంటకు కొన్ని ప్రాంతాల్లో జీవం పోయగా, మిగతా ప్రాంతాల్లో పత్తి చేలు వాడు ముఖం పట్టిన పరిస్థితులు ఉన్నాయి. రుణమాఫీ విషయంలోనూ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో చాలామంది రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతుబంధు స్థానంలో రైతుభరోసా' అనేది ఇప్పటికీ ఆచరణకు నోచలేదు. శ్రీశైలం సొరంగ మార్గం, నక్కలగండి ఎత్తిపోతల పథకం, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో సాగునీటి వనరులపై ప్రభావం చూపిస్తుంది. ఇక అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న మూసీ ప్రాజెక్టు మూలంగా కొన్ని ప్రాంతాల్లో ఉన్న రైతులకు మాత్రమే నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. ఇదిలా ఉంటే మార్కెటింగ్ సమస్య కూడా తీవ్రంగా ఉంది. బత్తాయికి సరైన మార్కెటింగ్ లేకపోవడంతో ఇప్పటికీ దళారులనే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది.

మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఏదీ అభివృద్ధి

15 ఏళ్ల క్రితం ఉన్న జిల్లా పరిషత్ పాలకవర్గాలకు మారుమూల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికోసం ప్రతీ ఏటా రూ.35కోట్ల వరకు ప్రత్యేక నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించే వారు. గత మూడు విడతలు పాలకవర్గాలకు ఆ నిధులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రభావం పడింది. ఇప్పటికే చాలా గ్రామాల్లో పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం లేకపోవడంతో పాటు చాలా చోట్ల గ్రామ పంచాయతీలకు భవనాలు కూడా లేవు. అధ్వానంగా ఉన్న రోడ్లతోపాటు వీధి లైట్ల నిర్వహణ లేకపోవడం, పారిశుధ్య సమస్యలు వెంటాడుతునే ఉన్నాయి. నిధులకొరత మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇప్పటికీ కొన్ని ఊర్లకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలతో ముఖ్యంగా ఆటోలపై ఆధారపడుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సైతం పల్లెలోకి వైద్యాన్ని చేరవేయలేక పోతుంది. మండలాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో అరకొర వైద్యం ఉండటంతో ప్రజలు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. దీని మూలంగా ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యారంగం కూడా గాడిలో పడటంలేదు. ఇప్పటికీ బడిఈడు పిల్లలు బడి బయటే ఉండటం, డ్రాపవుట్స్ పెరగడం ఆందోళన కలిగిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నప్పటికీ సౌకర్యాల కొరతతో ప్రజలు తమ పిల్లలను పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలలకే అత్యధికంగా పంపించడంతో చాలా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి.

తాగునీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తం



ఫ్లోరైడ్ విషపు నీటితో జీవచ్ఛవాలుగా మారిన ప్రజలకు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ కృష్ణాజలాలను అందించడంకోసం పథకాన్ని చేపట్టినప్పటికీ అది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇప్పటికీ మూడు జిల్లాల్లోని చాలా గ్రామాల్లో ఇంటింటికీ నల్లా నీరు రావడంలేదు. పైపులైన్లు ధ్వంసం కావడం, వాటర్ ట్యాంకులు అరకొరగా ఉండటంతో పాటు వాటి నిర్వహణ కూడా అంతంత మాత్రంగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాలకు కృష్ణాజలాలు పూర్తిస్థాయిలో అందడంలేదు. చాలా గ్రామాల్లో స్థానికంగా ఉన్న బోరునీటితోపాటు కృష్ణా జలాలను కలిపి సరఫరా చేస్తున్నారు. దీంతో స్వచ్ఛమైన నీరు అందక ప్రజలు రోగాల బారిన పడిపోతున్నారు. ముఖ్యంగా ప్రజలకు కావాల్సిన తాగునీటి పథకాలను అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. తాగునీటిని కొనుగోలు చేసి తాగడం ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా తొలిదశలో సుమారు 600 గ్రామాలకు తాగునీటి సరఫరా చేయడం కోసం వేసిన పైపులైన్లలో పలు మార్లు దెబ్బతినడం వల్ల నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది.

ఇన్నాళ్లూ చాలా నష్టపోయా..

ఇన్నాళ్లు పాశ్చాత్య పోకడలకు అలవాటు పడి చాలా నష్టపోయా. ఫ్రెండ్స్ టూర్‌లు అంటూ ఇష్టం వచ్చినట్టు తిరిగా. కానీ అవి శాశ్వతం కాదని తెలిసింది. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటా. నిజమైన సహజ జీవనశైలిని కొనసాగిస్తూ, భావితరలకు బాటలు వేయటంతోపాటు, సాంకేతికతతో వచ్చే ఇబ్బందులను విద్యార్థులకు వివరిస్తూ, దేశ భవిషత్‌లో భాగస్వామ్యవుతా. ఆగస్టు 15 జెండా పండుగలో పాల్గొని దేశ సమైక్యత, సమగ్రతను చాటుతా.

నరేష్, కోదాడ

యువతా మేలుకో..

కోదాడ: వజ్రతుల్య శరీరం, ఉక్కు కండరాలు, అపారమైన జ్ఞాననిధితో యువ సంపద భారతదేశం సొంతమని నాడు వివేకానందుడు చెప్పిన మాటలను యువత పెడచెవిన పెడుతోంది. అందుబాటులో టెక్నాలజీ, అరచేతిలోకి వచ్చిన ప్రపంచ కుగ్రామం, కరోనాతో మారిన పరిస్థితులు, పాశ్చాత్య విష సంస్కృతి, మత్తుకు అలవాటు పడిన యువత నేడు మూడుపదుల వయస్సులోనే 80 ఏళ్లకు చేరింది. నిస్సహాయస్థితిలో, నిస్సత్తువగా ఉంటూ ప్రపంచానికి సవాల్ విసరాల్సిన యువశక్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్న విమర్శలున్నాయి. పెద్దలు, గురువులు, భవిష్యత్ అంటే భయం లేకుండా పోయి, అంధకార పరిస్థితి కళ్లముందే కనిపిస్తుందంటున్నారు. అపార యువతను, వారి శక్తిని సన్మార్గంలో పెట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. మత్తుకు బానిసై, అరాచకాలు, అత్యాచారాలు, అక్రమాలు, అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలకు పూనుకుంటోంది. 20 ఏళ్లలోపు యువతకు సాంకేతిక(సెల్‌ఫోన్) అందుబాటులోకి లేకుండా చూడాలని, 1.5, 2జీబీ అంటూ యువతను పెడదోవలోకి నెడుతున్న సంస్థలను నిర్మూలించాలని మేథావులు సూచిస్తున్నారు. చదువుకున్న ప్రతీ ఒక్కరికి ఉపాధి మార్గాలను చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో సుమారు 39లక్షల జనాభా ఉంటే వారిలో 9లక్షలు(23శాతం) యువత ఉన్నారు. వారిలో ఆరేళ్లలోపు 3లక్షల మంది చిన్నపిల్లలు ఉన్నారు.



స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



ఎస్పీ శరత్ చంద్రపవార్‌తో కలసి స్వాతంత్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, ఆగస్టు 14: స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సంవత్సరం నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలకు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఆయన జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారని, ఇందుకుగాను స్టేజీ, అలంకరణ, వేడుకలకు హాజరయ్యే ప్రముఖులకు, ప్రజలు, మీడియా తదితరులందరికీ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రొటోకాల్ ప్రకారం సీట్ల ఏర్పాటుతో పాటు, టెంట్లు, తాగునీరు, ఏర్పాట్లలో ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలన్నారు. వర్షం వచ్చినా ఇబ్బంది కలగకుండా ఉండేలా రెయిన్ ప్రూఫ్ టెంట్లు వేయాలన్నారు. స్వాతంత్ర్య వేడుకల కార్యక్రమాలను ఆయన వివరిస్తూ ఉదయం 9 గంటలకు ముఖ్య అతిథి జాతీయ పతాకావిష్కరణ చేస్తారని, పోలీస్ గౌరవ వందనం స్వీకరణ, జిల్లా ప్రజలనుద్దేశించి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సాధించిన ప్రగతిపై ముఖ్య అతిథి ప్రసంగం, శకటాల ప్రదర్శన, పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ ఉంటున్నారు. ఆయా పథకాల కింద లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, స్టాళ్ల సందర్శన ఉంటాయని, ఈ కార్యక్రమాలన్నీ నిర్దేశించిన సమయం ప్రకారం పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వేడుకలకు హాజరయ్యే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్ కుమార్, ఆర్డీవో రవి, జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి, డీపీఆర్వో వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, డీఎస్పీ శివశంకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలి

ప్రభుత్వ ఆసుపత్రులపై ఫిర్యాదులకు ప్రత్యేక కంట్రోల్ రూం

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్ర ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులపై వచ్చే ఫిర్యాదులకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లోని డాక్టర్లు, సిబ్బంది వారి వారి ఆస్పత్రులపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. వైద్యంకోసం ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని, వారిని దుర్భాషలాడవద్దన్నారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడారు. ఎక్కువమంది జ్వరం, ఒళ్లు నొప్పులు, తదితర కారణాలతో ఆస్పత్రికి వస్తున్నారని గమనించిన ఆయన ఏ మండలాలు, గ్రామాల వారు వస్తున్నారని డాక్టర్లను అడిగారు. గడిచిన వారం రోజుల నివేదికను ఆధారం చేసుకుని ఏ ఏ మండలాల నుంచి జ్వర పీడితులు ఎక్కువగా వస్తున్నారో తెలపాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమణ కుమార్‌ను ఆదేశించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతిఒక్కరూ బాధ్యతతో పని చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు సంబంధించి ఫిర్యాదులకోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ ఉప కమిషన్ శ్యాంసుందర్ జాదు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

పనితీరుమార్చుకోక పోతే చర్యలు తప్పవు

మిర్యాలగూడ: పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్ని వార్డులను సందర్శించి పరిసరాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నందున ఆస్పత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. ఆయనవెంట మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ సమరథ్, వైద్యులు జగన్‌రెడ్డి, రాజు, సంజన ఉన్నారు.

ట్రయల్ రన్ విజయవంతం

పంపింగ్ మోటార్లను ఆన్‌చేసి పరిశీలించిన అధికారులు

బీవెల్లెంల రిజర్వాయర్ నింపడానికి సన్నాహాలు



బీ.వెల్లెంల సిస్టర్న్ నుంచి రిజర్వాయర్‌లోకి దుముకుతున్న కృష్ణా జలాలు

నార్కట్‌పల్లి, ఆగస్టు 14: నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల ఎత్తిపోతల ప్రాజెక్టు రిజర్వాయర్‌ను నింపేందుకు ప్రాజెక్టు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల చొరవతో ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్‌ఎల్‌బీసీకి రూ.800 కోట్లతో పాటు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన రిజర్వాయర్‌కు ఈనెలాఖరులోగా నీటిని పంపింగ్ చేసేలా నీటిపారుదల శాఖ ఎస్‌ఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2023 మే 9న మొదటి సారి అధికారికంగా ట్రయల్ రన్ చేశారే తప్ప రిజర్వాయర్‌ను నింపలేదు. ఈనెలాఖరులోగా రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేస్తామన్న మంత్రుల ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా రు. ఏడాది కింద ట్రయల్ రన్ చేసి, ఆ తర్వాత ఆపేసిన 16హెచ్‌పీ సామర్థ్యం గల పంపింగ్ మోటార్లను బుధవారం ఆన్‌చేసి పరిశీలించారు. ఎలాం టి సాంకేతిక సమస్య లేకుండా మోటార్లు నడవడంతో ట్రయల్ రన్ విజయవంతమైంది. మొదట ఓ మోటారును ఆన్‌చేసి పరిశీలించగా సిస్టర్న్ నుంచి కృష్ణాజలాలు రిజర్వాయర్‌లోకి వెళ్లాయి. మంత్రులు మోటార్లను స్విచ్ఛాన్ చేసిన తర్వాత రిజర్వాయర్ నింపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 0.3 టీఎంసీ ప్రకారం తొలత 30 శాతం మాత్రమే రిజర్వాయర్‌ను నీటితో నింపనున్నారు. కొన్ని నెలల తర్వాత 30శాతం ఇలా మూడు దఫాలుగా రిజర్వాయర్‌ను పూర్తిచేయనున్నట్లు తెలిసింది.

మంచి మార్గం వైపు పయనించాలి

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 14: మంచి మార్గం వైపు పయనిస్తే ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మిషన్ పరివర్తన్ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర, దేశవ్యాప్తంగా యువతను పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్య డ్రగ్స్ అని, దాని బారి నుంచి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మత్తు పదార్థాలు లేని తెలంగాణగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రెండవ బహుళ జోన్ ఐజీ సత్యనారాయణ మాట్లాడుతూ గంజాయిలాంటి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అన్ని దుష్పరిణామాలే అని, యువత మంచిని కోరుకునే వైపు వెళ్లాలని సూచించారు. చెడు వ్యసనాల వల్ల చెడు దారి పడతారని, అలా చేయవద్దని తల్లిదండ్రులు సైతం పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యరహిత జిల్లాగా మార్చేందుకు పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. చదువుకునే సమయంలో విద్యార్థులు చదువు పైనే దృష్టి పెట్టాలని, చదువుపై కాకుండా చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్తు కోల్పోతారని అన్నారు. జిల్లాలో గంజాయి వాడకం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, గంజాయి వాడితే అది మెదడుపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయితో పాటు, మత్తుమందుల నివారణలో భాగంగా పోలీస్ యంత్రాంగం ద్వారా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి రహిత నల్లగొండ కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ప్రజ్ఞ ఫౌండేషన్ సీఈవో గోనా రెడ్డి, అడిషనల్ ఎస్పీ రాములునాయక్, ఏఆర్ సూపరింటెండెంట్ సంతోష్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ టౌన్, ఆగస్టు 14: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఈ నెల 17వ తేదీన ఉంచి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్య భవన్ లో ఎల్‌ఆర్‌ఎస్‌పై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రతి గ్రామపంచాయతీకి ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందంలో నీటిపారుదల శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉంటారని తెలిపారు. బుధవారం 15 మండలాల బృందాలకు శిక్షణ ఇవ్వగా, ఈ నెల 16న తేదీన 16 మండలాల బృందాలకు ఎల్‌ఆర్‌ఎస్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసిన బృందాలు 17వ తేదీన పూర్తిస్థాయిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఈఈపీ దుర్గాప్రసాద్, డీటీసీపీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ సోయగం.. ముచ్చన్నెల మురిపెం



నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండు కుండలా ఉంది. ప్రాజెక్టు నీటిని బుధవారం రాత్రి రెండు గేట్ల ద్వారా దిగువకు వదిలారు. ఈ క్రమంలో ప్రాజెక్టుపై జాతీయ రంగులతో కూడిన విద్యుత్ దీపాలతో వెలిగించారు. • నాగార్జునసాగర్




దేశ సౌభాగ్యమంతా యువత చేతుల్లోనే..

గుజరాత్‌లోని నడియాడ్‌లో అక్టోబరు 31న జన్మించారు. భారత దేశ ఉక్కు మనిషి.. భారత బిస్మార్క్‌గా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధునిక భారత సివిల్ సర్వీస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దేశ సౌభాగ్య మంతా యువత చేతుల్లోనే ఉంటుందని పేర్కొనేవారు. దేశంలోని 565 సంస్థానాలను ఒక్కటి చేసిన ఘనత పటేల్ కే దక్కుతుంది. అంబేడ్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షుడిగా నియమించడంలోనూ ఈయన పాత్ర కీలకం. భారతదేశ మొదటి హోంమంత్రిగా, ఉప ప్రధానిగా పనిచేశారు. ఈయన దేశానికి చేసిన సేవలకు గుర్తుగా నర్మదా నదిపై సర్దార్ సరోవర్ డ్యాం (గుజరాత్)లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ పేరుతో 182 మీటర్ల ఎత్తయిన విగ్రహాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన విగ్రహంగా ప్రసిద్ధి చెందింది.




రొట్టెలకు బదులు రాళ్లు పొందారు

పంజాబ్‌లో జన్మించిన లాలా లజపతి రాయ్ ' ఆర్య సమాజం నాతల్లి, వైదిక ధర్మం నా తండ్రి' అనే నినాదం ఇచ్చారు. హిందూ సంఘటన్ పేరుతో హిందూ, ముస్లింల ఐక్యతకు కృషి చేశారు. 'బ్రిటీష్ వారి నుండి రొట్టెలకు బదులు రాళ్లు పొందారు' అని మితవాదులనుద్దేశించి విమర్శించారు. 'మన మీద పడుతున్న ఒక్కో లాఠీ దెబ్బ బ్రిటన్ స్వయంగా నిర్మించుకుంటున్న తన శవపేటిక మీదిక మేకే' దిగుతుందన్నారు.



దమ్ముంటే కాల్చుకోండి..

గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ ఉన్నత చదువుల కోసం దక్షిణాఫ్రికాకు వెళ్లి 1915, జనవరి 9న స్వదేశానికి తిరిగి వచ్చారు. బీహార్‌లోని రైతుల కోసం మొట్టమొదటి ఉద్యమం చంపారన్ సత్యాగ్రహం చేపట్టారు. 'శాంతి, అహింసే' తన ధ్యేయమే గాంధీకి ఓసారి తీవ్రమైన కోపం వచ్చింది. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమ సమయంలో 'దమ్ముంటే కాల్చుకోండి' అని బ్రిటీష్ వారి తుపాకీకి ఎదురుగా వెళ్లి సవాల్ విసిరాడు. కానీ ఆ అధికారులు ఆ సమయంలో వెనుదిరిగి పోయారు. మహాత్మాగాంధీని జాతి పిత అని సుభాష్ చంద్రబోస్ తొలిసారి పిలిచారు. మహాత్మా అని రవీంద్రనాథ్ ఠాగూర్, బాపూజీ అని జవహర్‌లాల్ నెహ్రూ పిలిచారు.'పునర్జన్మ అంటూ ఉంటే వచ్చే జన్మలో నేను అస్పృశ్యునిగా పుట్టాలి'అని ఆయన ప్రకటించుకున్నారు.



ప్రతీ కంట కన్నీరు తుడవడమే నా అంతిమ లక్ష్యం

అహ్మదాబాద్‌లో జన్మించిన జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక భారత నిర్మాతగా ఎంతో గుర్తింపు పొందారు. ఇతన్ని 'కమ్యూనిస్టు సిద్ధాంతాల పూజారి' అని కూడా పిలుస్తారు. 1936లో లక్నో సమావేశంలో 'సామ్యవాదం' అనే భావనను మొదటగా ప్రవేశపెట్టారు. గాంధీ పిలుపు మేరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. కుటుంబ రీత్యా శ్రీమంతుడైనప్పటికీ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని అనేకమార్లు సాధారణ ఖైదీల్లా జైలు జీవితం గడిపారు. 'ప్రతి కంటి నుండి కారే కన్నీరు తుడవడమే తన అంతిమ లక్ష్యం' అని ప్రకటించారు. భారతదేశంలో మానవ హక్కుల ఉద్యమానికి నాంది పలికారు. భారత దేశ మొట్టమొదటి ప్రధానిగా పనిచేశారు.



యాదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలకు శ్రీకారం

భువనగిరి అర్బన్, ఆగస్టు 14: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ప్రధానాలయంతో పాటు అనుబంధ ఆలయమైన పాతగుట్ట ఉభయ ఆలయాల్లో ప్రధాన అర్చక బృందం వేడుకలను నిర్వహించింది. ప్రాకారంలోని అద్దాల మండపం ముఖ మండపంలో అంకురార్పణతో పవిత్రోత్సవాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో ప్రారంభించారు. స్వస్తివాచనం, విశ్వక్సేనుడికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పీఠంపై ప్రధాన కలశాలను ఏర్పాటు చేసి గంగాజలంతో గర్భాలయంతో పాటు ఆలయ పరిసరాలు, భక్తుల క్యూలైన్లను సంప్రోక్షణ చేశారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో అంకురార్పణ చేశారు. 12 పాలికల్లో(మట్టి పాత్రలు) పుట్ట మట్టిని తెచ్చి వాటిలో నవధాన్యాలు, పంచామృతాలను నింపి ప్రత్యేక పూజలు, దేవతామూల మంత్రాలతో హవనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, ప్రధానార్చకుడు నల్లంథీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, డీఈవో దోర్బల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధానాలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీనృసింహుడికి నిత్య పూజలు

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా జరిగాయి. సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువైన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,77,665 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

ముందురోజే సంతకం.. ఇద్దరికి ఆబ్సెంట్

నేరేడుచర్ల, ఆగస్టు 18: ఒక రోజు ముందుగానే హాజరుపట్టికలో వైద్యాధికారి సంతకం చేయడం, ఇద్దరు సిబ్బందికి ఆబ్సెంట్, మరొకరికి సీఎల్ వేయటం సూర్యాపేట జిల్లాలో చర్చనీయాంశమైంది. బుధవారం నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీలో జరిగిన ఈ ఘటనను జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లగా పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెంచికల్‌దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సహా 17మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఉపేంద్ర అనే మహిళా సిబ్బంది మంగళవారం క్యాజువల్ లీవ్ (సీఎల్) తీసుకోగా, బుధవారం విధులకు హాజరయ్యారు. సంతకం పెట్టేందుకు ఆమె హాజరుపట్టిక చూడగా బుధవారానికి సీఎల్‌గా నమోదుచేసి ఉండటం, గురువారానికి ఆబ్సెంట్ వేసి ఉంది. దీంతో 14వ తేదీన హాజరైనట్లు ఉపేంద్ర సంతకం చేశారు. తర్వాతిరోజైన 15వ తేదీన తాను విధులకు గైర్హాజరైనట్లు నమోదుచేయడంతో సహచర సిబ్బందికి చెప్పి బోరుమనడంతో విషయం వెలుగుచూసింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు విలేకరులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా, వైద్యాధికారి డాక్టర్ సీతామహాలక్ష్మి ఆసుపత్రిలో లేరు. ఇప్పుడే బయటకు వెళ్లారని సిబ్బంది సమాధానమిచ్చారు. ఆసుపత్రిలో ఉన్న సీసీ కెమెరాలు పని చేయడం లేదు. హాజరు పట్టికలో 15వ తేదీకి సైతం వైద్యాధికారి సంతకం చేయగా, మరో ఇద్దరు సిబ్బంది నాగేశ్వరరావు, ఉపేంద్రకు గురువారం ఆబ్సెంట్ వేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన నిర్వహించనున్న పతాకావిష్కరణకు సిబ్బంది మొత్తం హాజరు కావల్సి ఉండగా, ఇద్దరు సిబ్బందికి ముందుగానే ఆబ్సెంట్, సీఎల్ నమోదు చేయడంపై విలేకరులు డీఎంహెచ్‌వో కోటా చలం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఘటనపై వైద్యాధికారిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. మరుసటి రోజు సంతకం చేసిన విషయాన్ని విలేకరులు కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ దృష్టికి తీసుకువెళ్లి, వివరాలు పంపగా, పూర్తి స్థాయిలో విచారణ చేసి వైద్యాధికారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విషాహారం తిని నెమలి మృతి

● సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో ఘటన

గరిడేపల్లి, ఆగస్టు 14: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని కాచవారిగూడెంలో అస్వస్థతకు గురైన నెమలి చికిత్స చేస్తుండగా మృతిచెందింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు తంగెళ్ల లక్ష్మయ్య బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో తన పొలం వద్దకు వెళ్లగా, ఓ నెమలి అస్వస్థతతో కొట్టుకుంటూ కన్పించింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వటంతో వారు లక్ష్మయ్య ఇంటికి చేరుకుని నెమలిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే అస్వస్థతకు గురైన నెమలి నోటి నుంచి నురగ వస్తుందని, మందు కలిపిన ఆహారం తిని ఉండవచ్చని అధికారులు గుర్తించి హుజూర్‌నగర్‌లోని వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తమ పరిధి కాదని గరిడేపల్లి వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడి సిబ్బంది సూచించగా, గరిడేపల్లి తీసుకువచ్చారు. అనంతరం డాక్టర్ రవి చికిత్స చేస్తుండగా, నెమలి మృతిచెందింది. నెమలి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి వడ్ల గింజలు ఉన్నట్లు గుర్తించారు. వరి పొలాలు లేని సమయంలో వడ్ల గింజలు ఎలా వచ్చాయని అటవీ అధికారులు రైతు లక్ష్మయ్యను ఫోన్‌లో సంప్రదించగా ఎలుకల బారి నుంచి పంట పొలాలు కాపాడుకునేందుకు రైతులు వడ్లు, బియ్యం, నూకలు వంటి వాటిలో ఎలుకల మందు కలిపి వరాలపై పెడతారని చెప్పాడు. కాచవారిగూడెం గ్రామ శివారులో పెద్ద బండరాళ్లు ఉండడంతో అప్పుడప్పుడు నెమళ్లు వస్తుంటాయని తెలిపారు.



బతికి ఉన్నప్పుడు కాచవారిగూడెంలో నెమలిని అధికారులకు అప్పగిస్తున్న రైతు లక్ష్మయ్య

ఆన్‌లైన్ లింకుతో టోకరా

● ఇద్దరి ఖాతాలనుంచి నగదు ఊడ్చివేత

● ఒకరివి రూ.40వేలు, మరొకరివి రూ.36వేలు

భువనగిరి రూరల్, ఆగస్టు 14: తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని పరిచయం లేని వ్యక్తులు చెప్పిన మాటలు విని ఆన్‌లైన్ లింకును ఓపెన్ చేసి ఇద్దరు వ్యక్తులు వేర్వేరు చోట్ల తమ బ్యాంకు ఖాతాలనుంచి నగదును కోల్పోయారు.. భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం బండసోమారం గ్రామానికి చెందిన కొల్తూరి బాలరాజుకు ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం జాబ్ ద్వారా టాస్కులు చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చునని గుర్తు తెలియని వ్యక్తులు లింకు పంపించగా ఆ లింకు ఓపెన్ చేయడంతో కొల్తూరు బాలరాజు బ్యాంకు ఖాతా నుంచి రూ. 40వేలు పోగొట్టుకున్నాడు. భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయిగిరికి చెందిన శనిగాల నర్సింగ్‌రావు, దనిలోన్ యాప్ ద్వారా లోన్ వస్తుందని గుర్తు తెలియని వ్యక్తులు ఆయనకు ఫోన్ చేసి మెసేజ్ పెట్టడంతో అతని వివరాలు గుర్తు తెలియని వ్యక్తులు అతని వివరాలు తెలుసుకుని అతని బ్యాంకు ఖాతా నుంచి రూ. 36వేలను కాజేశారు. దీంతో ఇరువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్‌లో పెట్టిన మెసేజ్‌లకు స్పందించి మోసపోవద్దని వెంటనే 1930 సైబర్‌క్రైంకు కాల్ చేసి దరఖాస్తు నమోదు చేసుకోవాలని ఎస్ఐ సంతోష్ కుమార్ కోరారు.

42 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చింతపల్లి, తిప్పర్తి, ఆగస్టు 14: నల్లగొండ జిల్లాలోని చింతపల్లి, తిప్పర్తి మండలాల్లో బుధవారం 42 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన జెనిగల మహేష్ మల్లారెడ్డిపల్లి నుంచి మాడ్గుల్ వైపునకు ఆటోలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బాధ్యుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తిప్పర్తి ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం పచ్చర్లబొడ్డు తండాకి చెందిన బాణోతు మోహన్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో 12 క్వింటాళ్ల బియ్యాన్ని సేకరించారు. సేకరించిన బియ్యాన్ని అధిక ధరకు విక్రయించడానికి మినీ గూడ్స్ టీఎస్ 07యూసీ 6447 గల నెంబరు గల వాహనంలో నకిరేకల్ వైపు తరలిస్తుండగా మామిడాల స్టేజీ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తి, వాహనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఎస్ఐ డి. రాజు తెలిపారు.

కుక్కదాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

కొండమల్లేపల్లి, ఆగస్టు 14: నల్లగొండ జిల్లా మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాలో ఒకే కుక్క పదేళ్లలోపు ముగ్గురు చిన్నారులను తీవ్రంగా గాయపరిచింది. తండావాసులు తెలిపిన ప్రకారం... తండాకు చెందిన ఇస్లావత్ నరేష్-ప్రియాంక దంపతుల కుమార్తె తన్విత, సంతు-మంజుల దంపతుల కుమారుడు రాజు, ముడావత్ కృష్ణ- బుజ్జిల కుమారుడు పవన్ తమ ఇంటి ఎదుట ఆడుకుంటున్నా రు. ఓ కుక్క వారి వద్దకు వచ్చి ఒకరి తర్వాత ఒకరిని తీవ్రంగా గాయపర్చింది. గమనించిన స్థానికులు తరమడంతో కుక్క అక్కడి నుంచి పరిగెత్తింది.

నేడు ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోనున్న శ్రీనివాస్

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 14: చౌటుప్పల్‌లో ట్రాఫిక్ ఏఎస్ఐ కాట్రగడ్డ శ్రీనివాస్ 2022 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం అందించే ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికై ఈనెల 15వ తేదీన గోల్కొండ కోటలో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఆయన మెడల్ అందుకోనున్నారు. ఎస్‌బీ ఏఎస్సై విధులు నిర్వహిస్తున్న సమయంలో చేసిన సేవలకు గాను అనేక రివార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఆయన సేవలు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022సంవత్సరంగాను ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు.



పూర్తిస్థాయికి చేరుకున్న సాగర్ నీటిమట్టం

• నిండుకుండలా సాగర్ జలాశయం

• రెండు గేట్ల నుంచి నీటి విడుదల



రెండు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు, నీటి మట్టం సూచీ

నాగార్జునసాగర్, ఆగస్టు 14: ఎగువనుంచి వస్తున్న వరదతో నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోగా, రెండు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 5వ తేదీన క్రస్ట్‌గేట్లను ఎత్తి ప్రాజెక్టు అధికారులు దిగువకు నీటిని విడుదల చేయగా, వరద రాక స్వల్పంగా తగ్గటంతో 12వ తేదీన క్రస్ట్‌గేట్లు మూసివేశారు. ఎగువనుంచి స్వల్పంగా వరద రాక కొనసాగుతుండటంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 590 అడుగులకు (312.0450టీఎంసీలకు) చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు (15.8070టీఎంసీలు) కాగా శ్రీశైలానికి ఎగువ నుంచి 1,15,976 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైలం నీటి మట్టం 880.80 అడుగులుగా (192.5300టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాలల్లో విద్యుదుత్పత్తి చేయడం ద్వారా 68,483 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. దీంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి (590 అడుగులకు) చేరుకుంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 7,528 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 7,601 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,394 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, రెండు క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 16,200 క్యూసెక్కులు, మొత్తం 63,123 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 68,483 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.


17 రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టం

కృష్ణాబేసిన్‌లో కురుస్తున్న వర్షాలతో సాగర్ జలాశయానికి జూలై 29వ తేదీన వరద రాక ప్రారంభమైంది. డెడ్ స్టోరేజీకి దిగువన(503అడుగులు) ఉన్న సాగర్ నీటిమట్టం 17 రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టానికి (590 అడుగులు) చేరుకుంది.

642 అడుగులకు చేరిన 'మూసీ' నీటిమట్టం

ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు దిగువన గల ప్రాజెక్టుకు బుధవారం మరోసారి ఇన్‌ఫ్లో పెరిగింది. రెండు రోజులుగా నిలకడగా కొనసాగిన ఇన్‌ఫ్లో ఎగువన కురుస్తున్న వర్షాలతో బుధవారం పెరిగింది. దీంతో మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 642 అడుగులకు చేరింది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి 793.39 క్యూసెక్కులుగా ఉండగా బుధవారం సాయంత్రానికి 1232.51 క్యూసెక్కులుగా నమోదైంది. 645 అడుగుల (4.46 టీఎంసీలు) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 642.15 అడుగులుగా (3.73టీఎంసీ) ఉంది. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడికాల్వకు 257.89 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 257.89 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.







చికిత్స పొందుతూ జీపీ కార్మికుడి మృతి

పెన్‌పహాడ్, ఆగస్టు 14: ఆత్మహత్యా యత్నం చేసిన గ్రామ పంచాయతీ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ పెరిక రవీందర్ తెలిపిన వివరాల ప్రకాంర.. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన నెమ్మాది వెంకన్న(50) ఈనెల ఏడో తేదీ మధ్యాహ్నం ఎక్కడో పురుగుమందు తాగి ఆ డబ్బాతో ఇంటికి వచ్చి స్పృహ కోల్పోయాడు. గమనిం చిన కుటుంబ సభ్యులు వెంకన్నను చికిత్స కోసం 108అంబులెన్సులో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తర లించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకన్న మంగళవారం మృతి చెందాడు. అనారోగ్యంతో ఆరు నెలలుగా వెంకన్న ఇబ్బంది పడుతున్నారని, మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారాఉ. వెంకన్నకుభార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకన్న మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువు లకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వెంకన్న (ఫైల్ ఫొటో)

భర్త కళ్లెదుటే భార్య మృతి

అర్వపల్లి, ఆగస్టు 14: రోడ్డు ప్రమాదంలో భర్త కళ్లెదుటే భార్య మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని వేల్పు చర్ల స్టేజీ వద్ద మంగళ వారం జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అడివెంల గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు గోల్కొండ బాలనర్సయ్య-లక్ష్మి(65) దంప తులు మంగళవారం రాత్రి బైక్‌పై అర్వపల్లి సంతకు వెళ్లారు. సంతలో సరుకులు కొనుగోలు చేసి స్వగ్రామం అడివెంల గ్రామానికి వెళు తుండగా మార్గ మధ్యలో వేల్పుచర్ల స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయే క్రమంలో బైక్ రోడ్డుపై ఉన్న బండరాయిని ఎక్కింది. ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లక్ష్మి రోడ్డు మీద పడి తల వెనకభాగాన తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, బాల నర్సయ్యకు గాయాలయ్యాయి. రక్తస్రావంతో ఉన్న భార్యను అక్కున చేర్చుకుని విలపిస్తూ అమ్మ చనిపోయిం దంటూ కుమారుడు, కుమార్తెకు ఫోన్‌లో చెప్పడం చూసి చూపరులు కంటతడి పెట్టారు. గ్రామంలో బాలనర్సయ్య-లక్ష్మి దంపతులు అందరితో కలివిడిగా ఉండేవారు. లక్ష్మి మృతదేహానికి పోలీసులు తుంగతుర్తి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగిం చారు. లక్ష్మి అంత్యక్రియలను బుధవారం గ్రామంలో నిర్వహించారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.



ఒడిలో భార్య మృతదేహంతో బంధువులకు సమాచారం ఇస్తున్న భర్త



సాయుధ పోరాటంతోనే తరిమికొట్టాలి

ఓ వైపు గాంధీజీలాంటి వారు అహింసతోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని నమ్మి పోరాటం చేస్తుంటే సుభాష్ చంద్ర బోస్ మాత్రం 'సాయుధ పోరాటం' ద్వారానే ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టాలని నమ్మి, దాన్ని ఆచరణలో పెట్టారు. జాతీయ కాంగ్రెస్‌కు రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైన బోస్ గాంధీజీతో అభిప్రాయ బేధాలు వచ్చి ఆ పదవికి రాజీనామా చేశారు. గాంధీ అహింసావాదం మాత్రమే సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని నమ్మి ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌ను ఏర్పాటు చేశారు. రష్యా, జర్మనీ, జపాన్‌లలో పర్యటించి, ప్రత్యేక ఆర్మీని తయారు చేశారు. జపాన్ సహాయంతో భారత యుద్ధ ఖైదీలు, రబ్బరు తోట కూలీలు, ఔత్సాహికులను ఆర్మీలో చేర్చుకున్నారు. చివరగా విమాన ప్రమాదంలో మృత్యువాత పడ్డారన్న వార్తలు వినిపించాయి.



ఇంక్విలాబ్ జిందాబాద్

నేటి పాకిస్తాన్‌లోని లాయల్ జిల్లా బంగా గ్రామంలో పుట్టిన భగత్‌సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ (విప్లవం వర్ధిల్లాలి..) అంటూ ఢిల్లీ వీధుల్లో ఎర్ర కాగితాలు చల్లి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. యుక్త వయస్సులోనే ఐరోపా ఉద్యమాలను చదివిన భగత్‌సింగ్ అరాచకవాదం, సామ్యవాదమునకు ఆకర్షితుడయ్యాడు. భారత, బ్రిటన్ రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. బ్రిటీష్ వారి అరాచక నిర్ణయాలను మొదటి నుంచి వ్యతిరేకించి వారి కంటిలో నలుసుగా మారారు. బ్రిటీష్ అధికారి జేపీ శాండర్స్ హత్యలో భగత్‌సింగ్ ప్రమేయం ఉందని, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌లతో కలిపి ఉరి తీయబడ్డారు.



కులగణన చేపట్టాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

నల్లగొండటౌన్, ఆగస్టు 14: రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కూడా బీసీ రాజ్యాధికారం కోసం పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్లుగా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణ సౌకర్యం కల్పించలేదని, ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసి చేతివృత్తి దారులను కాపాడాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పున్న పవన్‌కుమార్, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్గం సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు గడగోజు విజయ్. జిల్లా కార్యదర్శి దీకొండ నవీన్‌కుమార్, పద్మశాలీ జిల్లా నాయకులు పున్న పాండు, రావిరాల వెంకట్, నాయకులు రాజు, నరసింహ, జితేందర్, రమేష్, ఖమ్మంపాటి శంకర్‌దుర్గ, లింగయ్యయాదవ్, నల్లోజు మురళి, గడ్డం దశరథ, ఆచారి పాల్గొన్నారు.

రేపటిపౌరుల్లో జాతీయతను పెంపొందిద్దాం

మిర్యాలగూడ, ఆగస్టు 14: రేపటి పౌరుల్లో జాతీయతా భావాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆవిష్కరించనున్న వంద అడుగుల జాతీయ జెండా పనులను బుధవారం ఆయన డీఎస్పీ రాజశేఖర రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నెస్పీ మైదానంలో ఏర్పాటు చేసిన 100 అడుగుల జాతీయజెండాను ఆగస్టు 15 సందర్భంగా ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ విద్యార్థుల పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంపై కళాకారులు రూపొందించిన నృత్యరూపక ప్రదర్శన అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంఈవో బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నెస్పీ క్యాంపు మైదానంలో జెండా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

పోలీసుల తిరంగా ర్యాలీ

నాగార్జునసాగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సాగర్ హిల్‌కాలనీలో బాలవిహార్ నుంచి ప్రధాన డ్యాం వరకు సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ షరీఫ్‌అలీ, సాగర్ సీఐ బీసన్న ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ జాతీయ జెండాలను పట్టుకొని ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్నారు.



తిరంగా బైక్ ర్యాలీలో పాల్గొన్న సీఆర్‌పీఎఫ్, పోలీసులు

'డిండి'కి డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం

గట్టుప్పల్, ఆగస్టు 14: దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం డిమండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చాపల మారయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండిని పూర్తి చేసి సాగునీరు అందించే వరకు మా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆగస్టు 12 నుంచి 19వ తేదీ వరకు గ్రామాల వారీగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన సూచించారు. ఆగస్టు 20 నుంచి 26వ తేదీ వరకు మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని, సెప్టెంబరు 2వ తేదీన సేకరించిన సంతకాలను కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కేరళలో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, స్పెషల్ ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో బాధితులకు నిధులను సేకరించారు. కార్యక్రమంలో గట్టుప్పల్ మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, నాయకులు జెర్రిపోతుల ధనుంజయగౌడ్, పగిళ్ల శ్రీను, పడసబోయిన యాదగిరి, నగేష్, కృష్ణ, నరసింహ, విశ్వనాథం, చెన్నయ్య పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

హాలియా, ఆగస్టు 14: కల్లుగీత కార్మికులకు ఎన్నికల హామీలను అమలుచేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు అన్నారు. అనుముల మండలం చింతగూడెం గ్రామంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీతారాములు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, చెట్ల పెంపకానికి భూమి, పింఛన్ తదితర హక్కులు సాధించిన చరిత్ర కల్లుగీత కార్మిక సంఘానిదన్నారు. సంఘం మండల అధ్యక్షుడు కాట్నం యాదగిరిగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు కాసాని సత్తయ్యగౌడ్, నాయకులు వడ్డగోని వెంకన్నగౌడ్, కాట్నం సైదులుగౌడ్, నవీన్‌గౌడ్, రామలింగం, సైదయ్య, శివ, నర్సింహ, గోవిందు, సాయికుమార్, సైదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి'

హాలియా, ఆగస్టు 14: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని హాలియా మునిసిపల్ కమిషనర్ ఎండీ మున్వర్ అలీ అన్నారు. హాలియా పట్టణంలో బుధవారం వివిధ దుకాణాలు, బేకరీ, కిరాణ షాపుల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు విక్రయంపై తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులెవరూ ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించరాదని, 'స్వచ్ఛదనం - పచ్చదనం' కార్యక్రమంలో ప్లాస్టిక్ కవర్లను నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను వాడితే జరిమానాలను విధిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణదారులకు రూ. 13 వేల జరిమానాను విధించారు. కార్యక్రమంలో ఆర్‌వో శ్రీధర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

శాలిగౌరారం, ఆగస్టు 14: మా దక ద్రవ్యాలతో మత్తుకు బానిసై బంగారం లాంటి జీవితాలను నాశ నం చేసుకోవద్దని శాలిగౌరారం ఎస్ ఐ సైదులు అన్నారు. మిషన్ పరివర్తన్‌లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని గీతాంజలి హైస్కూల్ విద్యార్థులతో మండ ల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైదులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతాంజలి, హైస్కూల్ కరస్పాండెంట్ దొంతూరి పరమేష్, ప్రిన్సిపాల్ ప్రభంజన్, ఏఎస్ఐ వెంకటయ్య, కానిస్టేబుళ్లు ఊర నాగయ్య, హోంగార్డు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22 మందికి ఉద్యోగ అవకాశం

నల్లగొండటౌన్, ఆగస్టు 14: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాకు మొత్తం 5 ప్రముఖ కంపెనీలు హాజరుకాగా 117 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వీరిలో 56మంది అభ్యర్థులు ప్రాథమికంగా ఎంపిక కాగా కేఎల్ గ్రూప్‌లో 9 మందికి, అన్నపూర్ణ ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఇద్దరు, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌లో ముగ్గురు, వెస్టీజ్‌లో 8 మందికి మొత్తం 22 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు అనంతరం జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సామ మాధవరెడ్డి వారికి నియామక పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ కార్యాలయ సిబ్బంది, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలి

నార్కట్‌పల్లి, ఆగస్టు 14: విషజ్వరాలు విజృంభిస్తున్న దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేసి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి దోమలు వాలకుండా నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, నాయకులు కల్లూరి యాదగిరి, చింతపల్లి బయ్యన్న, అర్థం శ్రీనివాస్, దండు రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనగణమన గీతాలాపన

మునుగోడు, ఆగస్టు 14: మునుగోడులో బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగ యాత్ర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం జనగణమన గీతాలాపన ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి జాతీయజెండాలతో స్థానిక ప్రధాన రహదారులపై ప్రదర్శన నిర్వహించారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల ఆత్మశాంతి కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం నాడు ఎంతోమంది ప్రాణత్యాగాలు చేశారని కొనియాడారు. వారి త్యాగ ఫలమే నేటి స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెంబర్ల జానయ్యయాదవ్, నాయకులు దూడల బిక్షంగౌడ్, దర్శనం వేణుకుమార్, గోపినాథ్, అశోక్‌గౌడ్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలి

చింతపల్లి, దామరచర్ల, శాలిగౌరారం, చిట్యాల రూరల్, నాగార్జునసాగర్, ఆగస్టు 14: విద్యార్థులందరూ ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలని పలువురు సూచించారు. బుధవారం జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు దాతల సహకారంతో పుస్తకాలు, టై, బెల్టు, షూలు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ విద్య విలువైన సంపద అని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. దేశ నిర్మాతలు ఉపాధ్యాయులేనని, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.

- చింతపల్లి మండలం పోలేపల్లిరాంనగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు పడకంటి రాజుగౌడ్ స్వంత డబ్బులు రూ.20 వేలతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, టై బెల్టు, దుస్తులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవేందర్‌రెడ్డి, గ్రామస్థులు పడకంటి మల్లేష్, మొగుతాల దుర్గయ్య, బోస్ ఆనంద్, పిట్టల రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.
- దామరచర్ల మండలంలోని కల్లెపల్లి జడ్పీ హైస్కూల్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ధీరావత్ బుజ్జిలింగానాయక్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీను, ఉపాధ్యాయులు నాగునాయక్, సునీత, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు కరుణ, బాల పాల్గొన్నారు.
- శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలోని జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు రూ.లక్ష రూపాయల విలువైన టై, బెల్ట్, షూలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో మేక నాగయ్య, హెచ్ఎంలు ఎం.సైదులు, నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి నరేందర్, పూర్వ విద్యార్థులు నూక కిషోర్, రాజు, సూరారం ఆంజనేయులు, జలేందర్, వెంకటేష్, లింగేష్, వెంకన్న, సతీష్, శ్రవణ్ పాల్గొన్నారు.
- చిట్యాల మండలంలోని వట్టిమర్తి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి బూరుగు శ్రీనివాస్ రూ.20వేల విలువైన షూలను పంపిణీ చేశారు. విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ నర్రా మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, శీలం మధుసూదన్‌లు టై, బెల్టులను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పందిరి రమేష్, ఏఏపీఎస్ చైర్మన్ మేడి శ్రీలత, సాగర్ల నరేష్, మేడి హరికృష్ణ, సిర్పంగి గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు నీలకంఠం ఉమామహేశ్వరి, ఏర్పుల వాసవి అత్యధిక జీపీఏ సాధించినందుకు ఇదే పాఠశాలకు చెందిన (1985-86) పూర్వ విద్యార్థులు రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. వల్లందాసు నిశిత కూడా విద్యార్థులకు రూ.5వేలు బహుమతిగా అందజేసింది. కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, మాజీ సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, నూతి సత్యశ్రీ వెంకటేశం, ముద్దసాని రమణారెడ్డి, మంజుల, జానయ్య, నరేష్ పాల్గొన్నారు.
- పెద్దవూర మండలంలోని పులిచర్ల జడ్పీ హైస్కూల్‌లో దాతల సహకారంతో సమకూర్చిన టై, బెల్టులు, ఐడీ కార్డులను తహసీల్దార్ పావని సరోజ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు సుష్మ, దాతలు సుధీర్, చిరంజీవి, మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, లక్ష్మయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం నూలగడ్డ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓగోటి సైదులు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. నియామక పత్రాన్ని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం ఓగోటి సైదులుకు అందజేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తన నియమాకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలగిరి(సాగర్): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో పదవ, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం కె.శ్రీనివాస్ అన్నారు. చదువు మానేసిన వారు పదో తరగతి, పదవ తరగతిలో ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి అర్హులని అన్నారు. ఆసక్తి గల వారు సెప్టెంబరు 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నార్కట్‌పల్లి: మాతృ వియోగం పొందిన బి.వెల్లెంల తాజా మాజీ ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్యను జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరామర్శించారు. మండలంలోని బి.వెల్లెంలలో యాదయ్య నివాసంలో అతని తల్లి పార్వతమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి ఓదార్చారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆయా పార్టీల నేతలు యాదయ్యను పరామర్శించారు.

మాడ్గులపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రఫీ అన్నారు. మండలంలోని కన్నెకల్ గ్రామంలోని ప్రజలకు వైద్యశిబిరాన్ని నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏదైనా సమస్య ఉంటే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రజిని, సూపర్‌వైజర్ స్టెల్లా, ఎంఎల్‌హెచ్‌పీ జోసఫ్, భవాని, జ్యోతి, మౌనిక, పుష్పలత, ఏఎన్ఎం రోజా, ఆశాలు పాల్గొన్నారు.

చిట్యాల రూరల్: చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గ్రామ మాజీ సర్పంచ్ రాచమల్ల రామచంద్రం మృతి చెందారు. వృద్ధాప్య సమస్యలతో పాటు కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ చనిపోయారు. సీపీఎం గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కమిటీల్లో రామచంద్రం పనిచేశారు. కొన్నాళ్ల పాటు పార్టీ నార్కట్‌పల్లి మండల కార్యదర్శిగా కూడా తన సేవలందించారు. రామచంద్రం అంత్యక్రియలు ఆయన స్వగ్రామం వట్టిమర్తిలో గురువారం జరుపనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కట్టంగూరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, హిందువులను రక్షించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు, నాయకులు కోమటి భాస్కర్, వెంకన్న, నాగరాజు, వెంకట్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మునుగోడులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మిర్యాల వెంకటేష్ కుటుంబానికి గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి రూ. 10వేల ఆర్థికసాయం అందజేసినట్లు ప్రకటించారు. అట్టి డబ్బులను బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేసినట్లు ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, మండల నాయకులు బండ రఘులు తెలిపారు.

మిర్యాలగూడ: జాతీయ జెండా ఆవిష్కరణలోనూ ఎమ్మెల్యే రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ ఎండీ ఇలియాస్ ఖాన్ విమర్శించారు. ప్రొటోకాల్ ప్రకారం జాతీయజెండా ఆవిష్కరణకు మునిసిపల్ కౌన్సిలర్లను ఆహ్వానించలేదని ఆరోపించారు.

నాగార్జునసాగర్: సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు వెళ్లగా ఆయనపై కేటీఆర్ సోషల్ మీడియా డైరెక్టర్ దిలీప్ సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు తన్నీరు సతీష్, గాలి సైదిరెడ్డి అన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని బుధవారం సీఐ బీసన్నకు ఫిర్యాదు చేశారు.

నార్కట్‌పల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఈవో ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై నిర్వహించిన పాటల పోటీలో మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని సిద్ధిత జిల్లా స్థాయిలో 3వ స్థానంలో నిలిచారు. మాదక ద్రవ్యాలు అనే అంశంపై డైట్ కాలేజీలో నిర్వహించిన ఈ పాటల పోటీలో సిద్ధిత ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలిచింది.

కేతేపల్లి: మండల కేంద్రం కేతేపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మనిమద్దె అంతయ్య కుటుంబానికి స్థానికుడైన విశ్రాంత ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బాధితులకు క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టి సాల్మన్, బీరం జాన్‌రెడ్డి, ఎండీయూసుఫ్‌జాని, కరుణాకర్‌రెడ్డి, వీరాచారి, రవి పాల్గొన్నారు.

కట్టంగూరు: సాయుధ పోరాట యోధుడు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు బూర్గు అంజన్న సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. అంజయ్య వర్ధంతి సందర్భంగా మండలంలోని ఈదులూరు గ్రామంలో నిర్మించిన లైబ్రరీని ఎమ్మెల్యే ప్రారంభించారు.

దేవరకొండ: ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అన్నారు.

నకిరేకల్‌లో హైవేపై దొంగల హల్‌చల్

నకిరేకల్, ఆగస్టు 14: నకిరేకల్ పట్టణ శివారు 65వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం దొంగలు హల్‌చల్ చేశారు. ఈ సంఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు... కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన మర్రి శ్రీను, మౌనిక దంపతులు కొంతకాలంగా సూర్యాపేట పట్టణంలోని ఓ షాపింగ్‌మాల్‌లో పని చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. బుధవారం స్కూటీపై నార్కట్‌పల్లికి వెళ్లిన శ్రీను మౌనిక దంపతులు సాయంత్రం సూర్యాపేటకు తిరిగి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో నకిరేకల్ పట్టణ శివారులోకి రాగానే ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి మౌనిక వద్ద ఉన్న పర్సు, బ్యాగును లాక్కెళ్లారు. ఊహించని ఈ పరిణామం నుంచి తేరుకునే సరికి పల్సర్ బైక్ వేగంగా దూసుకెళ్లింది. దీంతో బాధితుడు శ్రీను నకిరేకల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాగులో నగదు, ఏటీఎం, ఇతర కార్డులు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.